ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ప్రత్తిపాడు సభకు హాజరైన జన సందోహం



రాజధాని.. అమరావతే

- ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి
- 30 రోజుల్లో రాష్ట్రంలో మారనున్న చరిత్ర
- జూన్ 4న జగనాసుర వధ.. అమరావతి వేడుక
- మళ్లీ జగన్‌కు ఓటేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లే
- అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం
- తాడికొండ, ప్రత్తిపాడు ప్రజాగళం సభల్లో చంద్రబాబు



ప్రత్తిపాడులో కండువాలు ఊపుతూ ఉత్సాహపరుస్తున్న చంద్రబాబు, రామాంజనేయులు, పెమ్మసాని



తాడికొండలో వేదికపై ప్రసంగిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్



- తాడికొండ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

తాడికొండ, ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: ప్రపంచంలో తెలుగు వారు గర్వపడేలా రాజధాని అమరావతిని నిర్మిస్తా. అమరావతే ఆంధ్రుల రాజధాని. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే రోజే అమరావతే రాజధాని అని మీరంతా వేడుక జరుపుకునే రోజు. అదేరోజున జగనాసుర వధ.. అమరావతి రక్షణ రెండూ జరుగుతాయి. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లేనన్నారు. మరో 30 రోజుల్లో రాష్ట్రంలో చరిత్ర మారుతుందన్నారు. రాజధాని అంటే ఆత్మ గౌరవం.. ఆత్మవిశ్వాసం.. గర్వంగా చెప్పుకునే ప్రజల ఆస్తి అన్నారు. హైదరాబాద్‌కు ధీటుగా, దేశంలో నెంబర్ వన్‌గా, ప్రపంచంలో గొప్ప నగరాల్లో ఒకటిగా చెప్పుకునే రాజధానిని నిర్మించాలనుకున్నా కానీ మూడు రాజధానులంటూ అమరావతిని జగన్ సర్వనాశం చేశారన్నారు. విట్, అమృత, ఎస్ఆర్ఎం వంటి ప్రపంచస్థాయి విద్యాసంస్థలతో అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా మార్చాలనుకుంటే జగన్ సర్వనాశనం చేశాడన్నారు. అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం.. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. 3 వేల కేసులు.. అడు గడుగునా అవమానాలు, పోలీసుల హింస, జైల్లో పెట్టి వేధింపులు.. ఎన్ని చేసినా పోరాటం ఆపలేదని, వారి పోరాటంతోనే అమరావతి గెలిచింది.. నిలిచిందన్నారు. రాష్ట్రం బాగుండాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు.

ప్రజాగళం.. నూతనోత్తేజం

- తాడికొండ, ప్రత్తిపాడు పసుపుమయం
- చంద్రబాబు రాకతో పులకించిన జనం

ప్రజల కేరింతలు.. తెలుగు తమ్ముళ్ల జయజయధ్వానాలు.. యువత సందడి.. మహిళల హారుతులు.. పసుపు జెండాల రెపరెపల మధ్య శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో చంద్రబాబు ప్రజాగళం కార్యక్రమం జరిగింది. రోడ్ షో, బహిరంగ సభలకు జనం పోటెత్తారు. చంద్రబాబు పర్యటన మార్గాలు జనాలతో కిటకిటలాడాయి. ప్రజాగళంతో కూటమి పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ప్రజాగళం కార్యక్రమాలకు సమీప మండల గ్రామాల నుంచి భారీగా జనం ఉత్సాహంగా తరలివచ్చారు. చంద్రబాబును చూసిన ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తాడికొండ, ప్రత్తిపాడు ప్రధాన కూడళ్లు పసుపు జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయాయి. హెలికాప్టర్‌లో తాడికొండకు వచ్చిన చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హెలి ప్యాడ్ నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాడికొండలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సభా స్థలి వద్దకు చేరుకుని ప్రసంగించారు. ఈ సభకు రాజధాని పరిధిలోని గ్రామాల నుంచి మహిళలు, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబు కోసం ఎదురు చూశారు. సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు జెండాలతో మద్దతు తెలిపారు. సభ అనంతరం చంద్రబాబు హెలికాప్టర్‌లో ప్రత్తిపాడుకు చేరుకున్నారు. చంద్రబాబు రాకతో ప్రత్తిపాడు పులకించిపోయింది. ఆయన రాక సందర్భంగా ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. ఆయా సభలో చంద్రబాబు తమ్ముళ్లూ అంటూ పలకరించిన తీరు.. నా ఆడబిడ్డలు అంటూ చూపిన ఆప్యాయతతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆయా సభల్లో గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ, ప్రత్తిపాడు అభ్యర్థులు తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మతో అలింగనం



చంద్రన్నకు దిష్టి తీస్తూ..



ప్రత్తిపాడులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు



తాడికొండలో సభలో మహిళల అభివాదం



ప్రత్తిపాడు సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు



ప్రత్తిపాడులో మిద్దెలపైకెక్కిన అభిమానులు



గజమాలతో స్వాగతం

సమన్వయంతో సత్తా చాటాలి

- అశ్రద్ధ వీడాలి.. స్పీడ్ పెంచాలి
- విజయమే ధ్యేయంగా ముందుకెళ్లాలి
- కూటమి నేతలతో రేపల్లెలో చంద్రబాబు సమీక్ష

రేపల్లె/బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దు. సమన్వయంతో పనిచేయాలి. విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలి. భారీ మెజార్టీ కోసం సత్తాచాటాలి. గడువు చాలా స్వల్పంగా ఉంది. గెలుపు విషయంలో అతి ధీమా పనికి రాదు. వైసీపీ చేసిన విధ్వంసాన్ని ప్రతి ఒక్క ఓటరును కలిసి వివరించాలి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల లోక్‌సభ పరిధిలోని కూటమి నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజాగళం సభ అనంతరం శుక్రవారం రాత్రి రేపల్లె టీడీపీ కార్యాలయంలో బస చేసిన ఆయన శనివారం కూటమి నేతలతో ఎన్నికలపై సమీక్షించారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఆయా నేతల పనితీరుపై తన దగ్గరున్న నివేదికల ఆధారంగా వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అశ్రద్ధ వద్దని, మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కొందరు నేతలను సున్నితంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ప్రజాగళం సభల విజయవంతంపై సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు ప్రజలతో మరింత మమేకం అవ్వాల్సిన అవసరం ఉందని నేతలకు చెప్పారు. నియోజకవర్గాల్లో చేపట్టే కార్యక్రమాల్లో జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవాలని టీడీపీ నాయకులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఒక కుటుంబ సభ్యుల్లా తారతమ్యాలు లేకుండా కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చెయ్యాలన్నారు. ఎన్నికలకు ఇక 30 రోజులే గడువు ఉందని, అందరూ కష్టపడాలన్నారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఓటర్లను చైతన్యవంతులను చేసి పోలింగ్ కేంద్రాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగన్‌రెడ్డి పాలన అవినీతి అక్రమాలతో పాటు మోపిన బారాలను ప్రజలకు వివరించాలన్నారు. రేపల్లెలో గతంలో హత్యకు గురైన బాలుడు అమర్నాథ్‌గౌడ్ సోదరి హేమశ్రీ కుటుంబ సభ్యులతో చంద్రబాబును కలవగా ఆమె చదువు బాధ్యతలు తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. రేపల్లెకు చెందిన మన్నె శ్రీనివాసరావు తాను రచించిన ఎన్టీఆర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చంద్రబాబుకు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు రేపల్లె నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు గుంటూరు జిల్లా తాడికొండలో జరిగే ప్రజాగళం సభకు తరలివెళ్లారు.



బాపట్ల పార్లమెంట్ పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో చంద్రబాబు సమీక్ష

నేడు తెనాలికి పవన్‌కల్యాణ్

- వారాహిపై పట్టణంలో రోడ్ షో
- సభలో ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల
- ఏర్పాట్లను పరిశీలించిన మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13: గతంలో వాయిదా పడిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన తాజాగా ఖరారైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారు. ఆయన తెనాలి రావడం ఇదే తొలిసారి కావడంతో పవన్ అభిమానులు, జనసేన శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్ ద్వారా తెనాలి సుల్తానాబాద్‌లోని హెలీప్యాడ్ వద్దకు పవన్ చేరుకుంటారని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అక్కడి నుంచి వారాహి వాహనంపై పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చెంచుపేట, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్లోని పురవేదిక వద్దకు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం జరిగే బహిరంగ సభలో పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ పర్యటన, బహిరంగసభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామని మనోహర్ తెలిపారు. ఈ సభకు గుంటూరు, బాపట్ల, కృష్ణ జిల్లాల నుంచి ఉమ్మడి పార్టీల నాయకులు, శ్రేణులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరవుతారని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పా టు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను శనివారం కూటమి నేతలతో కలిసి మనోహర్ పరిశీలించారు. పవన్ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను ఆయన కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో పవన్‌కల్యాణ్ ప్రజల ముందుంచుతారని తెలిపారు. కార్మికులు, రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి చేపట్టబోయే పరిష్కారాలను కూడా ప్రస్తావిస్తారన్నారు.



సభాప్రాంగణం వద్దకు ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి వస్తున్న మనోహర్

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

బాపట్ల, ఏప్రిల్ 13: వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సాగర్ నీటి విడుదల, విద్యుత్ సరఫరా, ఉపాధి పథకం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో శనివారం బాపట్ల నుంచి ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. పశ్చిమ కృష్ణాడెల్టా, సాగర్ కాల్వల ద్వారా 17 వరకు జిల్లాకు తాగునీరు విడుదల అవుతుందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన చెరువులను నూరుశాతం నింపుకోవాలన్నారు. తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని పొలాలు, చేపల చెరువులకు మళ్లించకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కాల్వలపై పోలీసులు గస్తీ తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీను కలెక్టర్ ఆదేశించారు. గుండ్లకమ్మకు నీరు విడుదల చేస్తామన్నారు. యద్దనపూడి, చుండూరు, సంతమాగులూరు, చెరుకుపల్లి, చినగంజాం మండలాల్లో ఉపాధి పనుల్లో పురోగతి లేకపోవడంపై ఎంపీడీవోలను కలెక్టర్ ప్రశ్నించారు.



కలెక్టర్ పి.రంజిత్‌బాషా

'మనూ'లో కోర్సులు

దిక్సూచి

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా...

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం)

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ.

ప్రొఫెషనల్ డిప్లొమాలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

అకడమిక్ మెరిట్ ద్వారా...

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)

ఇవి కాకుండా ఫుల్‌టైమ్ పార్ట్ టైమ్ కోర్సులు మరికొన్ని కూడా ఉన్నాయి.

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు: హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు అందిస్తోంది.

(ఇవి కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని క్యాంపస్‌ల్లో ఉన్న కోర్సులు - అర్హతలు తదితరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.)

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/ZmApBfvలో చదవండి.

చిత్ర పరిశ్రమకు, అభిమానులకు అంకితం

\- రామ్‌చరణ్



హీరో రామ్‌చరణ్ 'గౌరవ డాక్టరేట్' అందుకున్నారు. సినీ, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలకు గాను చెన్నైలోని ప్రముఖ 'వేల్స్ యూనివర్శిటీ' ఆయనకు శనివారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, యూనివర్శిటీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ ఐసరి గణేశ్ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ... 'నా పై ఇంత అభిమానంతో గౌరవ డాక్టరేట్ బహూకరించిన వేల్స్ వర్శిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు. 38 ఏళ్లుగా నడుస్తున్న యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వస్తోందంటే ముందు మా అమ్మే నమ్మలేదు. ఆర్మీలాంటి గ్రాడ్యుయేషన్స్ మధ్య నేను ఇలా ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నా తల్లిదండ్రులకు, అభిమానులకు, దర్శకులకు, నిర్మాతలకు, తోటి నటీనటులకు అంకితమిస్తున్నా.' అన్నారు. తాను చెన్నైలోని విజయా హాస్పిటల్లోనే జన్మించానని, పద్మశేషాద్రి స్కూల్లో చదివానన్నారు. ఈ ప్రాంతం తనకెంతో ఇచ్చిందన్నారు. తన తండ్రి చిరంజీవి జీవన ప్రయాణం కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారన్నారు. తన సతీమణి ఉపాసన కుటుంబం అపోలో హాస్పిటల్స్‌ను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించిందన్నారు. 80 శాతం తెలుగు సినిమాలు ఇక్కడే రూపొందేవని, తెలుగు సినీ పరిశ్రమకు ఇది పుట్టిల్లులాంటిదన్నారు. ఏదైనా సాధించాలని కలలు కని, చెన్నైకి వస్తే అది తప్పకుండా నెరవేరుతుందని వ్యాఖ్యానించారు. అది ఈ ప్రాంతం గొప్పతనమన్నారు. అన్ని రంగాల వారికి ఈ భూమి కలలు నెరవేర్చేదన్నారు. తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తను నటిస్తున్న గేమ్ చేంజర్ మూవీ సెప్టెంబర్-అక్టోబరు నెలల్లో విడుదలయ్యే అవకాశముందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి, చెన్నై.

జీరో బడ్జెట్‌తో శరపంజరం



గంగిరెద్దుల అబ్బాయితో జోగిని ప్రేమలో పడితే ఎటువంటి పరిణామాలు సంభవించాయన్న ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న 'శరపంజరం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంద. నవీన్‌కుమార్ గట్టు, లయ జంటగా నటించారు.ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నవీన్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాను. ఎంతో మంది మిత్రులు నాకు అండగా నిలిచారు. జీరో బడ్జెట్‌తో కేవలం స్నేహితుల సహకారంతో ప్రారంభించిన ఈ యజ్ఞం పూర్తి చేసి విడుదల వరకూ వచ్చాం. గణపతిరెడ్డి మాకు ఎంతో సహకరించారు.' అని చెప్పారు. సంగీత దర్శకుడు మల్లిక్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందనీ, ఆకలితో ఉన్న వాడికి అన్నం పెడితే జీవితాంతం గుర్తుంచుకుంటాడని, ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలనీ గణపతిరెడ్డి అన్నారు.

వినోదం పంచే కొంచెం హట్కే



గురుచరణ్, కృష్ణ మంజూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కొంచెం హట్కే'. అవినాశ్ కుమార్ దర్శకత్వంలో అభిమాన థియేటర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇందులో హీరో హీరోయిన్లు ఉండరు. పాత్రలే ఉంటాయి. సినిమా వినోదాత్మకంగా ఉంటుంది' అన్నారు. కొంతమంది కలసి సినిమా తీయడానికి చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయని గురుచరణ్ తెలిపారు.

గొప్ప కంటెంట్‌తో టెనెంట్

సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించారు. ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నటుడు ప్రియదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యం రాజేశ్ మాట్లాడుతూ 'డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. ఇందులో గొప్ప కంటెంట్ ఉంది. ప్రేక్షకులు ప్రతి క్షణం ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మహిళలకు కనెక్ట్ అయ్యే



కథ ఇది. మా నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే చిత్రమవుతుంద'న్నారు. నిర్మాత మాట్లాడుతూ 'బలగం, కాంతార' లాంటి సహజత్వం ఉన్న కథతో తెరకెక్కిన సినిమా 'టెనెంట్'. ఈ చిత్రంలో భావోద్వేగాలు అద్భుతంగా పండాయి' అని చెప్పారు.

మేకప్ మాన్‌కు క్లాప్



దివంగత నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మేకప్ మ్యాన్'. దివాకర్ యడ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కుమార్ మెట్టుపల్లి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టగా, లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ప్రతి చిత్రానికి కీలకమైన మేకప్ మ్యాన్‌ల పాత్రను, వారి జీవితాన్ని ఇందులో చూపించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో కట్టా రంజిత్, ఆనంద్ భారతి, చిట్టిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ, ఎడిటర్: వాసు వర్మ, సంగీతం: ఎం ఎం శ్రీలేఖ.

నవ్య 'దృశ్యం'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/zvr6wiU
లో చదవండి.

రాజధానికి భూములిస్తే రోడ్డు పాలు చేశారు

● 1579 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఏప్రిల్13: రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు భూములు ఇస్తే మూడు రాజధానులని తమను రోడ్డు పాలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి పుట్టగతులుండవని రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1579వ రోజుకు చేరున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, రాజధాని అమరావతిని స్వాగతిస్తున్నామని ఎన్నికల ముందు చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట మొదలు పెట్టి అమరావతిని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల అంశాన్ని అమలు చేయాలని అనుకోవటం పెద్ద తప్పిదమన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించాలని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

కొండవీడుకోటలో బయల్పడిన శాసనం



కొండవీడుకోటలోని పుట్టాలమ్మ చెరువు సమీపంలో రంగ మండపం రాతి స్థంభంపై బయల్పడిన 15వ శతాబ్దం నాటి శాసనం

కొండవీడుకోట(యడ్లపాడు), ఏప్రిల్ 13: పల్నాడుజిల్లా యడ్లపాడు మండలం కొండవీడుకోటలో క్రీశ 15వ శతాబ్దానికి చెందిన శాసనం బయల్పడినట్లు కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు. కొండవీడుకోటలో మండపాలుగా పిలువబడే నాలుగు నిర్మాణాలు ఉన్నాయని, వాటిలో రెండింటిని గుర్రపుశాల, రెడ్డిగారి భోజనశాలలుగా వాడుకలో ఉన్నాయన్నారు. మిగిలిన రెండింటిని మండపాలుగానే గుర్తిస్తున్నారు. పుట్టాలమ్మ చెరువుకు పడమర దిక్కున ఉన్న శిథిల మండపంలోని ఓ రాతి స్తంభంపై పెద్దకోమటి వేమారెడ్డికి చెందిన శాసనం బయల్పడిందన్నారు. దానితో పాటు మండపంలోనే మరో మూడు శాసనాలు కూడా లభ్యమయ్యాయన్నారు.

మంగళగిరి ప్రజల మనసులు గెలుస్తా

● మార్పు కోసమే వచ్చా.. మంగళగిరి చరిత్ర తిరగ రాస్తా..

● పసుపు జెండా ఎగరేసి అభివృద్ధికి చిరునామాగా మారుస్తా

● ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్



కుంచనపల్లి సమృద్ధి అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న లోకేశ్



లోకేశ్‌కు హారతులిస్తున్న అపార్టుమెంట్ వాసులు

తాడేపల్లి, ఏప్రిల్ 13: మార్పు కోసమే మంగళగిరికి వచ్చా.. 1985 తర్వాత ఇక్కడ టీడీపీ గెలవలేదు. ఈసారి పసుపు జెండా ఎగరేసి చరిత్ర సృష్టిస్తా.. మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మార్చి ప్రజల మనసుల్లో స్థానం సంపాదిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ అన్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లి సమృద్ధి అపార్టుమెంట్ వాసులతో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మంగళగిరిలో ఓడిపోయినా, నా సొంతం అనుకుని నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలు అందిస్తున్నానని, సొంత డబ్బుతో 29 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచానన్నారు. శాసనసభ్యునిగా ఎన్నికయ్యాక పేదరికం లేని మంగళగిరిగా తీర్చిదిద్ది మంగళగిరి మోడల్‌ను దేశానికి పరిచయం చేస్తానన్నారు. ప్రజలు కోరకపోయినా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసి పన్నుల భారం పెంచారని మౌలిక సదుపాయాలు విస్మరించారన్నారు. పంచాయతీలుగానే కొనసాగించాలని అనేక గ్రామాల ప్రజలు కోరుతున్నారన్నారు. కార్పొరేషన్ అంశం కోర్టు పరిధిలో ఉందని ప్రజాభీష్టం మేరకు ఈ రెండింటిని మున్సిపాలిటీగా మార్చి పన్నుల భారం తగ్గిస్తానన్నారు. నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజి నిర్మాణంతోపాటు కుళాయి ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తానన్నారు.

బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్‌తో అభివృద్ధి

బ్లాక్ డెవలప్‌మెంట్ విధానంలో రోడ్లు, పార్కులు, ఆరోగ్య కేంద్రాలు, ఏర్పాటు చేస్తామని లోకేశ్ చెప్పారు. 25 ఏళ్లుగా రెండు కుటుంబాలను ఆదరించారని, వారు ఒక్క పరిశ్రమ గానీ ఉద్యోగం గానీ తీసుకురాలేక పోయారన్నారు. స్వర్ణకారులు అధికంగా ఉన్నందున మంగళగిరిలో గోల్డ్ సెజ్ ఏర్పాటు చేసి 30 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు ప్రోత్సాహకాలు అందించి నియోజకవర్గానికి అనేక ఐటీ పరిశ్రమలు తీసుకువస్తే జగన్ వచ్చాక అవన్నీ తరలి పోయాయన్నారు. మంగళగిరికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఈ ఎన్నికల్లో 53500 ఓట్ల భారీ మెజారిటీతో నన్ను గెలిపిస్తే చంద్రబాబు, పవన్‌తో దెబ్బలాడి నిధులు తీసుకొస్తానన్నారు.

సమస్యలు విన్నవించిన అపార్టుమెంటు వాసులు

సమృద్ధి అపార్టుమెంట్ వాసులు పలు సమస్యలు లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, ఇందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు స్థానికంగా ఉపాధి ఏర్పాటు చేయాలని, అమరావతిలో స్థలాలు కొంటే పట్టాలు ఇవ్వలేదని, యానిమేషన్ రంగాన్ని ప్రోత్సహించాలని, రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. యువనేత లోకేశ్ స్పందిస్తూ మంగళగిరి నియోజకవర్గంలో పసుపు, మిర్చి వంటి స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు లాభసాటి చేస్తామని, సాంప్రదాయ కోర్సులతోపాటు విద్యతో పాటు ఉపాధి కల్పించే ప్రాసెసింగ్ కోర్సులు ప్రవేశపెడతామని, కేజీ నుంచి పీజీ వరకు సిలబస్‌లో మార్పులు తెస్తామని లోకేశ్ చెప్పారు.

టీడీపీలో చేరిన రావి వెంకటరమణ

● భారీగా తన అనుచరవర్గంతో సభకు వచ్చిన రావి



ప్రసంగిస్తున్న రావి వెంకటరమణ,పక్కన చంద్రబాబు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో సుమారు 350మంది పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ గూటికి చేరారు. తొలుత గుంటూరు జాతీయ రహదారి నుంచి రావి వెంకట రమణ భారీర్యాలీతో ప్రత్తిపాడు చేరారు. పార్టీలో చేరిన అనంతరం చంద్రబాబు సమక్షంలో రావి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అధికా రంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ప్రజలకు తాగునీరు కూడా అందించలేని ఈ ప్రభుత్వం ఉన్నట్టా అని ప్రశ్నించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశానని, ఆ పార్టీ వలన ఈ ప్రజలకు ఉపయోగం లేదన్నారు. రేపటి భవిష్యత్తుకు చంద్రబాబు అవసరం అన్నారు. అనంతరం చంద్రబాబు ప్రసంగంలో కూడా రావి వెంకటరమణను కొనియాడారు. 2004లో ఇక్కడ ఎమ్మెల్యేగా చేయడంతో పాటు పొన్నూరు నుంచి పోటీ చేశారని, బాగా కష్టపడి చేసే వ్యక్తికి ఆ పార్టీలో అన్యాయం జరిగిందన్నారు. మంచి వ్యక్తుల్ని మనం వదిలి పెట్టుకోకూడదన్నారు.

టీడీపీలోకి రావి రాకతో వైసీపీకి భారీ ఝులక్..

తెలుగుదేశం పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ రావడం వైసీపీకి భారీ నష్టమే కలిగింది. 2004 నుంచి 2009 వరకు ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఉన్న రావి వెంకటరమణకు ఇప్పటికీ నియోజకవర్గంలో గట్టి పట్టే ఉంది. ఎస్సీ రిజర్వేషన్ తరువాత ఇక్కడ మేకతోటి సుచరిత ప్రాతినిధ్యం వహించినా నేటికి నియోజకవర్గంలో ఆయన స్థానం పదిలంగానే ఉంది. నియోజకవర్గంలోని వైసీపీ క్యాడర్ నాయకులకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటున్న ఆయన వెంట నడిచేందుకు పెద్దఎత్తున పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న జగన్ సామాజికవర్గానికి చెందిన కొత్త మల్లాయపాలెం గ్రామం నుంచి కూడా మాజీ సర్పంచ్ వణుకూరి వీరారెడ్డి సైతం రావితో అడుగులు వేశారు. అంతేకాకుండా పాత మల్లాయపాలెం నుంచి కూడా ఆయనకు ఆదరణ లభిస్తుంది. నిమ్మగడ్డవారిపాలెం సర్పంచ్ భర్త గొరిజవోలు సతీష్, పెదనందిపాడు మండల మాజీ వైస్ కన్వీనర్ మదమంచి వాసు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కమ్మా శివప్రసాద్, ఏబీపాలెం సర్పంచ్ రావిపాటి కృష్ణప్రసాద్, ముప్పాళ్ల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ గుంటుపల్లి రవిబాబు, రాజుపాలెం సర్పంచ్ కమ్మా నాగమల్లేశ్వరరావు, కుర్రా శివనాగేశ్వరరావులతో పాటు పొన్నూరు, గుంటూరు నియోజకవర్గాలకు చెందిన సుమారు 350మంది రావితో టీడీపీలోకి వచ్చారు. వైసీపీలో సీనియర్ నాయకులు టీడీపీ గూటికి చేరడంతో వైసీపీకి గట్టి ఝులక్ తగిలింది.

ఎమ్మెల్యే కోన ప్రచారంలో వలంటీర్



కోన రఘుపతి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ ఊటుకూరి పావని

బాపట్లరూరల్, ఏప్రిల్ 13: ఎలక్షన్ కమీషన్ ఆదేశాలను లెక్క చేయకుండా వలంటీర్లు వైసీపీ నాయకుల ప్రచారంలో పాల్గొంటూనే ఉంటున్నారు. శనివారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించగా ప్రచారంలో ఆగ్రామానికి చెందిన ఊటుకూరి పావని అనే వలంటీర్ పాల్గొన్నారు. వలంటీర్లు ప్రచారంలో పాల్గొనటం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు.

కాచిగూడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 13: కాచిగూడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో ఆగిన సందర్భంగా రైల్వే ఎస్‌ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. డిఫెన్స్‌కు చెందిన సుమారు రూ.75వేల విలువైన 31 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వీటిని కలిగివున్న ప్రకాశం జిల్లా, గిద్దలూరు తాలూకా, రామాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

డీజీపీ, ఎస్పీ సార్ నాపై ఏఏ కేసులున్నాయ్..!

● వివరాలివ్వండి.. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి లేఖ



జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఏప్రిల్ 13: నామినేషన్లు దాఖలు చేసే సమయం దగ్గరపడుతుండడంతో మాచర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అప్రమత్తమయ్యారు. ఈనెల 7న సత్తెనపల్లికి వచ్చిన మాజీ సీఎం చంద్రబాబు బ్రహ్మారెడ్డికి ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినుంచి నీ మీద పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి సమాచారాన్ని తెప్పించుకోవాలని ఆదేశించారు. చంద్రబాబు సూచనల మేరకు ఇన్‌చార్జి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ గరికపాటి బిందుమాధవ్‌కు రాతపూర్వకంగా వినతిపత్రం ఇచ్చి వివరాలను కోరినట్లు సమాచారం. కొన్ని కేసులు వివరాల్వికుండా రహస్యంగా ఉంచి పాలకపక్షం కుట్రలు చేసే అవకాశం వున్నందున బ్రహ్మారెడ్డి అప్రమత్తమయ్యారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ఆరంభం కానున్న దృష్ట్యా నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేసుల వివరాలు తప్పనిసరిగా ప్రమాణపత్రంలో పొందుపరచాల్సి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నామినేషన్‌ను పక్కనపెట్టే అవకాశం ఉంది. బ్రహ్మారెడ్డిని మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా 2021 డిసెంబరు 22 రాత్రి చంద్రబాబు ప్రకటించగా ఆ తరువాత భారీ ఊరేగింపుగా పేటసన్నెగండ్ల ఆలయంలో పూజ చేసి మాచర్లకు చేరుకునే క్రమంలో కేసులు నమోదయ్యాయి. అలాగే 2022 డిసెంబరు 16న మాచర్లలో పార్టీ కార్యాలయాన్ని ప్రత్యర్థి పార్టీ వారు దగ్ధం చేసి దాడులు చేసి బ్రహ్మారెడ్డిపైనే కేసు నమోదు చేశారు. ఇంకా 2003 ఆగస్టు 28న గొట్టిపాళ్ల ఘర్షణకు సంబంధించి బ్రహ్మారెడ్డిపై కేసు నమోదు చేశారు. (అప్పుడు బ్రహ్మారెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో వున్నారు). అదే సంవత్సరం డిసెంబరులో బ్రహ్మారెడ్డి కాన్వాయ్ మాచర్ల సమీపంలో ఓ వ్యక్తికి తగలడంతో ఎస్సీ, ఎస్టీ అత్యాచారక నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఈ క్రమంలో ఒక వేళ అక్రమ కేసుల వివరాలు అందని పక్షంలో ఆర్‌టీఐ(రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్) కింద సమాచారం కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. కాగా ఈనెల 16 లోపు కేసుల వివరాలివ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

పసుపు రైతులను ఆదుకోవాలి

● చంద్రబాబుకు రైతుల వినతి

రేపల్లె, ఏప్రిల్ 13: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా పసుపు రైతులు తీవ్రంగా నష్టపోయామని రైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నష్టపోయిన పసుపు రైతులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం జనవరి 19తేదీన దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులు నిల్వ చేసుకున్న సుమారు లక్షా నాలుగు వేల పసుపు బస్తాలు కాలిపోయాయని వీటి మార్కెట్ విలువ రూ.115కోట్లు ఉంటుందని తెలిపారు. కోల్డ్‌స్టోరేజీ యజమాని కేవలం రూ.40కోట్లకు మాత్రమే ఇన్సూరెన్స్ చేశారని, ఒక్కో రైతుకు కేవలం క్వింటాకు రూ.5వేలు వస్తుందని తెలుపుతున్నారని దీని కారణంగా ఒక్కో క్వింటాకు రూ.10వేలు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు కోల్డ్‌స్టోరేజీ యజమాని ఇన్స్యూరెన్స్ సిబ్బంది ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని నష్టపోయిన రైతులకు అన్ని విధాలా ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్వింటాకు రూ.10వేలు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, రైతులు వైవీ సుబ్బారావు, పీవీ రాఘవరావు, సాంబశివరావు, వి.రఘురామ్, వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం



చిలకలూరిపేటకు సమీపంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న రూరల్ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

తాడికొండ, చిలకలూరిపేట, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడికొండ అడ్డరోడ్డులో పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. శనివారం వాహనాలను తనిఖీలు చేస్తున్న సమయంలో గోరంట్ల గ్రామానికి చెందిన దాడి శివబాబు వద్ద రూ.1.76లక్షలు పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవటంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకొని స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ టీజీ బొల్లారెడ్డికి అప్పగించారు.

చిలకలూరిపేట వద్ద...

చిలకలూరిపేట-పెదనందిపాడు మార్గంలో శనివారం వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో కారులో వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద రూ.9.30లక్షల నగదును గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ జి.రవికృష్ణ, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ మిట్టపాలెం గ్రామ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదనందిపాడు మండలం అన్నవరానికి చెందిన నల్లపనేని సుబ్బారావు ఈ నగదును ఒక ప్లాస్టిక్ సంచిలో పెట్టుకొని తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు గాని, బిల్లులుగాని అతడు చూపలేదు. దీంతో నగదును వారు స్వాధీనం చేసుకున్నారు.

● దాచేపల్లి: పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఓ మిర్చివ్యాపారి నుంచి రూ.2.23 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు దాచేపల్లి ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని తెక్కళ్లపాడు గ్రామానికి చెందిన పలుసులేటి అంకమ్మరావు మిరియాలగూడెంలోని మిర్చియార్డులో మిర్చి అమ్ముకొని నగదుతో తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించగా ఎన్నికల కోడ్ మేరకు అతని వద్ద పరిమితికి మించి నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెప్మా ఎండీ.. సీఎం బంధువు

● ఆరున్నర ఏళ్లు గా అక్కడే వున్నారు

● డ్వాక్రా సంఘాలకు వైసీపీకి ఓటేయమని చెబుతున్నారు

● ఎన్నికల కమిషన్‌కు న్యాయవాది బాబు ప్రకాష్ ఫిర్యాదు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 13: మెప్మా ఎండీ విజయలక్ష్మిని వెంటనే విధుల్లో నుంచి తప్పించాలని ప్రముఖ న్యాయవాది కర్లపూడి బాబుప్రకాష్ మెయిల్ పంపారు. గత ఆరున్నర ఏళ్లుగా ఆమె అదే పదవిలో కొనసాగుతున్నారని అందులో పేర్కొన్నారు. సీఎం జగన్ బంధువు కావటంతో తగిన అర్హత లేనప్పటికీ ఆమెకు ఎండీ పదవిని కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉండి విజయలక్ష్మి ఓటర్లను ప్రభావితం చేసేలా పావులు కదుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేలాది డ్వాక్రా సంఘాలను ప్రభావితం చేసి అధికార వైసీపీ లబ్ధి చేకూర్చాలని విజయలక్ష్మి ప్రయత్నం చేస్తున్నట్లు న్యాయవాది బాబుప్రకాష్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమెను ఆ పదవి నుంచిఇ తప్పించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మహేందర్ మృతదేహం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 13: పరీక్షల్లో ఫెయిల్ అవడంతో ఇంటర్ విద్యార్థి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం కంభంపాడులో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇర్ల మహేందర్ (17) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివాడు. శుక్రవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో సబ్జెక్టులు ఫెయిలవడంతో మనస్తాపం చెందాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

91 మంది వలంటీర్లు రాజీనామా

కొల్లూరు, ఏప్రిల్ 13: కొల్లూరు మండలంలో 91మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ రాజీనామాలు చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లూరు మూడు సచివాలయాల పరిధిలో 32మంది, జువ్వలపాలెంలో 12మంది, క్రాపలో 10మంది, చినపులివర్రు 7, దోనేపూడి 19, వీరుకాక మరో 10మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు సమర్పించారు. మరి కొంతమంది చేత కూడా రాజీనామాలు చేయించే పనిలో వైసీపీ నాయకులు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లుగా మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

గుంటూరు జంక్షన్ అంటే అంత చిన్నచూపా!

● తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ హెడ్‌క్వార్టర్స్ అయిన గుంటూరు రైల్వేజంక్షన్ విషయంలో రైల్వే శాఖ చిన్నచూపు చూస్తోంది. తాజాగా 14 ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటు చేసిన ఈస్టు కోస్టు రైల్వే శాఖ వాటిని గుంటూరు మీదగా నడుపుతూ ఇక్కడ నిలుపుదల సౌకర్యాన్ని కల్పించలేదు. దీనిపై జెడ్‌ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెంబరు. 02811 భువనేశ్వర్ - యల్హాంక జంక్షన్ రైలు ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18, 25 తేదీలలో, నెంబరు. 02812 యల్హాంక - భువనేశ్వర్ రైలు ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20, 27 తేదీల్లో నడుపుతామని ఈస్టు కోస్టు రైల్వే నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే ఈ రైళ్లు విజయవాడ తర్వాత నంద్యాలలోనే నిలుపుదల కల్పించారు. గుంటూరు డివిజన్‌లో ఎక్కువగా డిమాండ్ ఉండే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో నిలుపుదల సౌకర్యం కల్పించకపోవడం ఏమిటని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు రైల్వే శాఖని ప్రశ్నిస్తూ లేఖ పంపారు. అలానే నెంబరు. 02863/02864 హౌరా - యశ్వంత్‌పూర్ - హౌరా వీక్లీ ప్రత్యేక రైలు సర్వీసులను కూడా పొడిగించారు. వీటికి కూడా నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో నిలుపుదల కల్పించాలని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పులూరి శశిధర్‌చౌదరి రైల్వేకు లేఖ రాశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.96 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

తెలుగుదేశం పార్టీలో చేరిన జీకే నాయుడు

బాపట్ల, ఏప్రిల్ 13 : మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు జీకే నాయుడు, గాళ్ళ విజయనిర్మల దంపతులు తమ అనుచరులతో కలిసి శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పని చేసి ప్రజాసేవలో తనదైన ముద్రవేసుకున్న జీకే నాయుడు ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంతకాలంగా వైసీపీలో ఉంటున్న ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు. వీరితోపాటు బడుగులూధియా, నక్కా రోశయ్య, దొప్పల జయమ్మ, శ్రీనివాసరావు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, నాయకులు మరీదు వెంకటేశ్వరరావు, పల్లంజీవన్, ఝాన్సీరాణి, షేక్ నజ్మా పాల్గొన్నారు.



జీకే నాయుడు, గాళ్ళ విజయనిర్మల దంపతులకు టీడీపీలో చేర్చుకుంటున్న నరేంద్రవర్మ

వైసీపీ నాయకుడు షేక్ సాధిక్ టీడీపీలో చేరిక

కర్లపాలెం, ఏప్రిల్ 13 : కర్లపాలెం పంచాయతీలోని పాతూరుకు చెందిన షేక్ సాధిక్ టీడీపీ, జనసేన,బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సాధిక్‌కు నరేంద్రవర్మ తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



షేక్ సాధిక్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

సేవకులు నాయకులైతే ప్రజలకు మేలు

● వేగేశన సతీమణి హరికుమారి

బాపట్ల, ఏప్రిల్ 13 : దశాబ్దకాలంగా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందిస్తున్న వేగేశన నరేంద్రవర్మను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నాయకుడిగా మరెన్నో సేవలు విస్తరిస్తారని ఆయన భార్య వేగేశన హరికుమారి అన్నారు. నరేంద్రవర్మ గెలుపు కోరుతూ ఆయన భార్య హరికుమారి, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ గెలుపుకోరుతూ ఆయన భార్య శిరీషలు పార్టీశ్రేణులతో కలిసి శనివారం బాపట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 24వ వార్డు ప్రచారంలో హరికుమారి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నరేంద్రవర్మను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ భార్య శిరీష మాట్లాడుతూ ప్రజా సేవ చేసేందుకు ముందుకొచ్చిన కృష్ణప్రసాద్‌ను, నరేంద్రవర్మను గెలిపించి బాపట్ల పార్లమెంట్ సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానం విజేత, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, పార్లమెంట్ మహిళా కార్యదర్శి పల్లం సరోజినీ, పట్టణపార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కె.రమేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, మహిళానాయకులు షేక్.నజ్మా, దగ్గుమల్లి రాణి, సుజాత, కూచిపూడి ఝాన్సీరాణి, దండుమూడి సంధ్యారాణి, బొద్దుకూరి విజయ తదితరులు పాల్గొని ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థించారు.



కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయం కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న హరికుమారి, శిరీష, పార్టీ శ్రేణులు

జీవీజీ కృష్ణమూర్తి చిరస్మరణీయులు

బాపట్ల, ఏప్రిల్ 13 : కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా పని చేసి తెలుగువారి ఖ్యాతిని ఇనుమడింప చేసిన జీవీజీ కృష్ణమూర్తి ఎన్నికల రంగంలో పలు సంస్కరణలకు ఆద్యులయ్యారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి, ఎన్నికల నిఘావేదిక కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. జీవీజీ తృతీయ వర్ధంతిని ఎన్నికల నిఘావేదిక ఆధ్వర్యంలో శనివారం బాపట్ల టౌన్ హాలులో నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ 1993-1996 మధ్య కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా పనిచేశారన్నారు. ఎన్నికలు పటిష్ఠంగా నిర్వహించటానికి అనేక చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నిఘావేదిక సభ్యులు పాల్గొన్నారు.



జీవిజి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ పీసీ.సాయిబాబు తదితరులు

రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 13 : మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉండటం వల్ల వ్యవసాయ శాఖకు సంబంధించిన వివరాలు కోసం రైతులు మండలంలోని 12గ్రామాల సచివాలయ పరిధిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని అధికారులు తెలిపారు. లేదంటే మండలస్థాయిలో ఉన్న విస్తరణాధికారులను కాని సంప్రదించవలసిందిగా మండల వ్యవసాయశాఖ సిబ్బంది శనివారం తెలియజేశారు.



తెలుగు ప్రొఫెషనల్ వింగ్ టీమ్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న చంద్రబాబు



చంద్రబాబుకు ఎన్టీఆర్ విజ్ఞానసర్వస్వం తొలి గ్రంథం వెండితెర వెలుగులు పుస్తకాన్ని అందజేస్తున్న మన్నె శ్రీనివాసరావు

టీడీపీ గెలుపే ధ్యేయంగా కృషి చేయాలి

● అనగానికి అండగా నిలవండి

● వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళండి

రేపల్లె, ఏప్రిల్ 13 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను, ప్రజా వ్యతిరేకవిధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి అనగాని గెలుపునకు కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. రేపల్లె తెలుగు ప్రొఫెషనల్ వింగ్ టీమ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం మొత్తం కవర్ అయ్యేలా సైకిల్ యాత్రను శనివారం చంద్రబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైకిల్ యాత్ర ద్వారా గ్రామాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేసి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఐదేళ్ళలో జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన విధ్వంసకాండను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీ అభ్యర్థులైన అనగాని సత్యప్రసాద్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గెలుపునకు టీమ్ కృషి చేయాలని సూచించారు. టీమ్ సభ్యులు నరేంద్ర, హైమా, కల్యాణ్‌రామ్, రామారావు, నాగబాబు, శ్రీనివాస్, సునిల్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ సోదరి చదువు బాధ్యతలు నేను చూసుకుంటా

ప్రజాగళం పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును అమర్‌నాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు, సోదరి హేమశ్రీ శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కలిశారు. గత ఏడాది తన అక్కను వేధించిన వైసీపీ సాను భూతిపరుడు వెంకటేశ్వర్లురెడ్డిని ప్రశ్నించినందుకు అమర్‌నాథ్‌గౌడ్ అనే విద్యార్థిపై పెట్రోల్ పోసి హత్య చేసిన సంగతి తెలిసిందే. టీడీపీ ఆ సమయంలో అమర్‌నాథ్ కుటుంబానికి అండగా నిలిచి పోరాడింది. బాధిత కుటుంబానికి అప్పుడు పార్టీ తరుపున చంద్రబాబు రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించారు. అమర్‌నాథ్‌గౌడ్ సోదరి హేమశ్రీ ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో ఇంటర్ పూర్తి చేసింది. వారి యోగక్షేమాలు చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. హేమశ్రీ ఉన్నత చదువులు చదివించే బాధ్యతను తాను తీసుకుంటానంటూ చంద్రబాబు హామీనిచ్చారు. తాను పోలీస్ అవ్వాలనుకుంటున్నానని హేమశ్రీ చెప్పగా నువ్వు కష్టపడి చదువు అన్ని విధాలా నేను అండగా ఉంటానని బాబు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చంద్రబాబు

చంద్రబాబుకు వెండితెర వెలుగు గ్రంథం అందజేత

నందమూరి తారకరామారావు జీవిత చరిత్రను సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడు, రేపల్లెకు చెందిన సాహితీవేత్త మన్నె శ్రీనివాసరావు విస్తృత పరిశోధన చేసి రచించిన 'వెండితెర వేలుపు నందమూరి తారకరామారావు జీవిత చరిత్ర ఎన్టీఆర్ విజ్ఞాన సర్వస్వం' పుస్తకాన్ని శనివారం రేపల్లె టీడీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాసరావును చంద్రబాబునాయుడు అభినందించారు. మంచి లోతైన విశ్లేషణలతో కూడిన ఈగ్రంథాన్ని తయారు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తాం

టీడీపీ అధినేత చంద్రబాబును నాయుడిని శనివారం టీడీపీ కార్యాలయంలో రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన వెంకట గోపాలరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి ఏపీ ల్యాండ్ టైట్లిలింగ్ యాక్టు చట్టాన్ని రద్దు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో మాట్లాడుతూ సైకో జగన్ ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన ఈ చట్టం వలన ఎంతోమంది రైతులు, పేద ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని, తాము అధికారంలోకి రాగానే ఈ యాక్టును తక్షణమే రద్దుచేస్తామని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో న్యాయవాదులు, ఆళ్ళ సూరిబాబు, పి.భూషణం, వెంకట గిరిధర్, పుప్పాల ఐజ్, కొలుసు రామారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కొల్లూరు టీడీపీ నాయకులు

కొల్లూరు, ఏప్రిల్ 13 : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కొల్లూరు టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం రేపల్లెలో ఉన్న చంద్రబాబు వద్దకు మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, పాల సొసైటీ అధ్యక్షులు సుంకర రామమోహనబాబు, పార్టీ నాయకులు గుమ్మడి శివ తదితరులు చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లుగా నాయకులు తెలిపారు.

నేరాల అదుపునకు సెబ్ అధికారులు చర్యలు చేపట్టాలి

● జాయింట్ కమిషనర్ డాక్టర్ అరుణ్‌రావు

బాపట్ల, ఏప్రిల్ 13 : ఎన్నికల సమయంలో సెబ్ నేరాల అదుపునకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కమిషనర్ డాక్టర్ బి.అరుణ్‌రావు ఆదేశించారు. నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి ఆసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని తెలియజేస్తూ బాపట్ల సెబ్‌స్టేషన్‌లో అధికారులతో ఆయన శనివారం సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై సెబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి పలుసూచనలు చేశారు. బాపట్లసెబ్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అదేవిధంగా అక్రమ మద్యం నిల్వలు ఉన్న గోడౌన్‌లు, అక్రమమద్యం సరఫరా కేసులలో జీఆర్‌పి స్టాఫ్‌ను లింక్ చేయాల్సిందిగా, అక్రమ కల్లు అమ్మకాలపై, నాటుసారా తదితర నేరాలపై నిఘా పెట్టి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాల తనిఖీలు నిర్వహించి పొరుగు రాష్ట్రాలు నుంచి ఎటువంటి మద్యం రవాణా జరగకుండా చూడాలన్నారు. ఏ రాజకీయ పార్టీలకు కొమ్ముకాయకుండా నిష్పక్షపాతంగా మద్యం అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ బి.అరుణరావుతోపాటు మంగళగిరి ఏఈఎస్ జి.నరసింహారావు, జిల్లా సెబ్ అధికారి సీహెచ్‌వీ మహేష్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, బాపట్ల సెబ్ సీఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సెబ్ అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కమిషనర్ డాక్టర్ అరుణ్‌రావు

గత ఎంపీలు చేసిన అభివృద్ధి శూన్యం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, ఏప్రిల్ 13 : గడిచిన దశాబ్దకాలంగా బాపట్లలో గెలిచిన ఎంపీలు చేసిన అభివృద్ధి శూన్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు కోరారు. పట్టణంలో శనివారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన జేడీ శీలంను గెలిపిస్తే పార్లమెంట్‌లో బాపట్ల వాణిని వినిపించి అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. నేటి పాలకులు కుల, మతాలుగా విభజించి తమ వైపు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల దృష్టి మార్చే విధంగా కార్యక్రమాలు చేస్తూ అబద్ధపు అభివృద్ధి చూపిస్తున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, రాష్ట్ర నాయకులు చింతా బాబురావు, శీలం సాగర్, సురేష్, ఫిరోజ్, పార్టీ మండల అధ్యక్షుడు పి.శంకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, కె.శాంతి, మాజీ కౌన్సిలర్ బక్కా రోశయ్య, దోనేపూడి రవి, మరియమ్మ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు గంటా అంజిబాబు

ముగిసిన కుట్టుశిక్షణ

కర్లపాలెం, ఏప్రిల్ 13 : మండలంలోని యాజలిలో రాక్ చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆరునెలలు నుంచి మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. పాస్టర్ కె.అడ్వర్డ్ కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది మహిళలకు రేహబంత్ మినిస్ట్రీస్ ఉయ్యూరి వారి ద్వారా కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎం.కాంతరావు, పాస్టర్‌లు రత్నరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

బాపట్ల, ఏప్రిల్ 13 : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల అగ్నిమాపకాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కార్యాలయం వద్ద 1944 ఏప్రిల్ 14న బొంబాయి పట్నంలో జరిగిన అగ్నిప్రమాదంలోని మృతులకు నివాళులర్పించటం జరుగుతుందన్నారు. 15న ప్రధాన కూడళ్ళల్లో ఫైర్ డ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 16న వంటగ్యాస్ వినియోగంపై అవగాహన, 17న విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన, 18న పెట్రోల్‌బంకుల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, 19న ఎలక్ట్రానిక్ పరికరాల వాడకంలో పాటించాల్సిన అగ్నిప్రమాద నివారణ చర్యలపై ప్రజలకు వివరించటం జరుగతుందన్నారు. 20న అగ్నిమాపక కేంద్రంలో ముగింపుసభ జరుగుతుందని వెంకటేశ్వరరావు తెలిపారు.

17న శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 13 : మండల వ్యాప్తంగా ఈనెల 17వ తేదీన నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, శ్రీకోదండరామాలయం, అదేవిధంగా అల్లూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించేందుకు ఆలయాలలో చలువపందిళ్ళను సిద్ధం చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాలలోని వివిధ దేవాలయాలలో శ్రీరామనవమి పండుగ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల

కర్లపాలెం, ఏప్రిల్ 13 : మండలంలోని ఏట్రవారిపాలెం ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి తిరునాళ్ళ మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పలు ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లపై జెండాకర్రలను ప్రత్యేకంగా అలంకరించి శనివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద కళాకారులు చేసిన డప్పు విన్యాసాలు తిరునాళ్ళకు వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. మండలం నలుమూలల నుంచి విచ్చేసిన వందలాదిమంది భక్తులు శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారిని దర్శించుకొని నారికేళఫలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.



తిరునాళ్లలో డప్పు విన్యాసాలు తిలకిస్తున్న ప్రజలు

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి

కొల్లూరు, ఏప్రిల్ 13 : టీడీపీ సీనియర్ కార్యకర్త తోడేటి కోటేశ్వరరావు (70) మృతి చెందాడు. శనివారం మండల పరిధిలోని చింతల్లంక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ చింతల్లంకలోని ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు తన ప్రగాడ సంతాపం, సానుభూతి తెలియజేసి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయన వెంట టీడీపీ నాయకులు కోగంటి శివవెంకటేశ్వరరావు, కోగంటి సాంబశివరావు, కాసరనేని మోహన్, మున్నంగి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కోటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ

తిరోగమన దశలో రాష్ట్ర అభివృద్ధి

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు ఏప్రిల్ 13 : జగన్ ఈ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్ర అభివృద్ధిని తిరోగమన దిశలో సాగించాడు.. రూ.12 లక్షల కోట్ల మేర అప్పులు చేసి విలువైన ప్రభుత్వ ఆస్తులను కూడా తాకట్టుపెట్టాడని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. శనివారం రాత్రి పెనుకుదురుపాడు, వేటపాలెం, కెఎన్ పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధిని చూపే ప్రభుత్వాన్నే కోరుకుంటారు.. అప్పులు మిగిల్చే ప్రభుత్వాన్ని కాదు. జగన్ మూలధన పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనను పూర్తిగా గాలికొదిలేశాడన్నారు. తీర్చలేనంతగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా మార్చాడని విమర్శించారు. గ్రామాల్లో ఆనాడు తెలుగుదేశం చేసిన అభివృద్ధి తప్ప పురోభివృద్ధి ఛాయలు కనిపించడం లేదన్నారు. కనీసం నియోజకవర్గంలో ఒక కొత్త రోడ్డు వేసిన పాపాన పోలేదు. ఇక్కడ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఓటమి భయంతో వలసపోతే అధికార పార్టీకి మరో వలస పక్షి వచ్చింది. ఎన్నికలైన మరురోజు ఆ పక్షి కూడా ఎగిరిపోతుందన్నారు. మొదటి నుండి ఇదే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి ఎన్నడూ లేనంత అభివృద్ధిని గ్రామాల్లో చేసి చూపించానన్నారు. ఈ ఐదు సంవత్సరాల జగన్ పాలనలో రైతాంగం తీవ్రంగా నష్టపోయారన్నారు. తుఫాన్ సమయంలో ఆదుకోవడానికి ముందుకు రాలేదు. పంటలకు గిట్టుబాటు ధర లేదు. చివరికి పంట కాల్వల మరమ్మతులకు కూడా నోచుకోలేదన్నారు. విద్యావంతులకు ఉపాధి కల్పన లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు గూదేటి ఎల్లారెడ్డి, జనసేన వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఊసా రాజేష్, జనసేన నాయకులు వాగోలు రమేష్ బాబు, శ్రీరామ్‌మూర్తి, తెలుగుదేశం నాయకులు విఎస్‌కె ప్రసాద్, కుర్రి వెంకటరెడ్డి, భీమవరపు శ్రీమాన్, చీలి సుధాకర్, దోనేపూడి శేఖర్‌బాబు, రుద్రపాటి బుజ్జి, అడపా బుజ్జి, రవీంద్ర, మణి, మోర్ల శ్రీను, రాయపాటి శ్రీనివాసరావు, కావూరి శ్రీనివాసరావు, గుమ్మా రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారరథంపై నుంచి ప్రసంగిస్తున్న నక్కా ఆనందబాబు

అరాచక జగన్ పాలనకు బుద్ధి చెప్పాలి

● డాక్టర్ నక్కా అఖిలేశ్

వేమూరు, ఏప్రిల్ 13 : రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు బుద్ధి చెప్పాలని వేమూరు అసెంబ్లీ స్థానం నుండి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్ అన్నారు. మండలంలోని బూతుమల్లి గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులను స్వయంగా పరిచయం చేసుకుని గ్రామంలో ఇంటింటికి తిరిగారు. మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న తన తండ్రి ఆనందబాబును, బాపట్ల ఎంపీ అభ్యర్థి అయిన కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ వరప్రసాద్, మాజీ సర్పంచ్ తుమ్మల మధన్‌మోహన్‌రావు, సీనియర్ నాయకులు గోగినేని కేశవరావు, మాజీ ఎంపీపీ చవ్వాకుల రాఘవరావు, వేమూరి శేషగిరి, గోగినేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బూతుమల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అఖిలేశ్

ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

బాపట్ల, ఏప్రిల్ 13 : బాపట్ల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించటంతో శనివారం కళాశాల ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని బైపీసీ విభాగంలో ఉత్తమ ఫలితం సాధించిన బి.జాహ్నవిని అభినందించారు. అదేవిధంగా ఎంపీసీలో టి.నాగసిరితో పాటు బైపీసీలో 900లకు పైగా మార్కులు వచ్చిన 11 మంది, ఎంపీసీలో 900 మార్కులకు పైగా వచ్చిన 12 మంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు గెల్లి దిలీప్‌కుమార్, దొప్పలపూడి రామ్మోహనరావు, కోశాధికారి తాళ్ళూరి రామకృష్ణ, జాయింట్ సెక్రటరి, కరస్పాండెంట్ హరిపద్మప్రసాద్, ప్రిన్సిపాల్ పి.ఆంజనేయులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు

వేతనం రూ.300పడే విధంగా పని చేయాలి : ఎంపీడీవో

వేమూరు, ఏప్రిల్ 12 : ఉపాధి కూలీలు ప్రతి రోజు వేతనం రూ.300 పడే విధంగా పని చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. ఆయన మండలంలోని చావలి గ్రామ పరిధిలో ప్రారంభించిన ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ వేతనాన్ని పెంచడం జరిగిందని తెలిపారు. కాలువల పూడికల పనులు నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు పనిలో పాల్గొనాలన్నారు. తాగునీరు, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అన్న విషయాన్ని కూలీలను అడిగి తెలుసుకున్నారు. నీడ కోసం తప్పని సరిగా టెంట్లు ఏర్పాటు చేయాలని మేట్లను ఆదేశించారు. పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

త్వరలో ఐలెండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 13 : పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్ కూడలిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన ఫైబర్ విగ్రహాన్ని పిట్టలవానిపాలెం మండల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసోసియేషన్, మంతెనవారిపాలెం యువత ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో ఏళ్ళ క్రితం ఏర్పాటు చేయాల్సిన అంబేద్కర్ విగ్రహం నిర్మాణ పనులు ఎట్టకేలకు అంకురార్పణ జరుగుతున్నందుకు మండల అంబేద్కర్ అభిమాన సంఘం, నిర్వాహకులతోపాటు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ఈకార్యక్రమాన్ని శ్రీకారం చుట్టినట్లు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే ఏలూరికి బ్రహ్మరథం

- కూటమి ప్రచారంతో హోరెత్తిన పర్చూరు
- తిలకం దిద్ది హారతులతో ఆశీర్వదించిన మహిళలు
- స్వచ్ఛందంగా గ్రామస్థుల మద్దతు


పింఛన్ పెంచుతున్నట్లు అవ్వకు చెప్తున్న ఏలూరి


ఏలూరికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మహిళలు

పర్చూరు, ఏప్రిల్ 13: పర్చూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఏలూరి శనివారం పర్చూరులో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గుడిలో పూజలు చేసిన అనంతరం కార్యకర్తల తో కలసి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరికి ప్రజలు పెద్ద ఎత్తున ఎదురెళ్లి స్వాగతం పలుకుతూ మద్దతు తెలుపుతున్నారు. మహిళలు హారతులిచ్చి మేము సైతం అంటూ ప్రచారంలో వెంట నడుస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకుసాగారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్‌కుమార్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు.

కిక్కిరిసిన రహదారులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరికి మద్దత్తుగా అభిమానులు పెద్దఎత్తున తరలి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఆయా ప్రధాన వీధులు సైతం ప్రజలతో కిక్కిరిసాయి.. యువకులు, వృద్ధులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

అవ్వాతాతలకు ఏలూరి భరోసా

ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేని ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధులతో ఏలూరి కొంతసేపు ముచ్చటించారు. ఎన్నికల మేనిఫెస్టోలో అవ్వాతాతలకు జూన్ నుంచి రూ.4వేల చొప్పున పింఛన్ ఇవ్వ నున్నట్లు వివరించారు. ఓటు ద్వారా రాష్ట్ర భవిష్యత్‌కు బాసటగా నిలవాలని ఆయన కోరారు.

కలసికట్టుగా ముందుకు సాగుదాం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఐక్యంగా ముందుకుసాగి రానున్న ఎన్నికల్లో అరాచక వైసీపీ పాలకులను ఇంటికి సాగనంపాలని కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. పచ్చని పర్చూరే లక్ష్యంగా శక్తివంచన లేకుండా పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసిగి వేసారి పోవడంవల్లే నేడు కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం ఏలూరు ప్రచారంలో భాగంగా నేనూ మీవాడినే అంటూ బొమ్మల సెంటర్ టీ దుకాణంలో ఎమ్మెల్యే స్వయంగా టీకాచి ప్రజల కు ఇస్తూ అభిమానం చాటుకున్నారు. చెరుకూరులో ఏలూరి విస్తృత ప్రచారం చేశారు. సెంటర్లోని హోటల్లో ప్రజలందరితో కలసి టిఫిన్ చేశారు.

సహజ వనరులను దోచుకున్న వైసీపీ నేతలు

- టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి
- కూటమి అభ్యర్థి గొట్టిపాటి


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 13: వైసీపీ పాలకులు సహజవనరులను దోచుకున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మోదేపల్లిలో శనివారం ఎమ్మెల్యే గొట్టిపాటి ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిలిపేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ బిల్లులను చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకుంటామన్నారు. చిలకలేరు వాగులో గతంలో నీరు ఉండేదని, ప్రస్తుతం కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇసుక ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసేందుకు వీలుగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు గేట్లను పెట్టలేదన్నారు. సహజ వనరుల దోపిడీతో ప్రజలు వలస పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తామని గొట్టిపాటి చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అర్హులందరికి పింఛన్‌లు మంజూరు చేయగా, జగన్‌రెడ్డి వచ్చాక వైసీపీ సానుభూతిపరులకు మాత్రమే పించన్‌లు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ4వేలకు పెంచుతామన్నారు. అలాగే బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేస్తామని తెలిపారు. టీడీపీతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. జగన్‌రెడ్డి విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల రక్తాన్ని జలగలా పీల్చుతున్నారన్నారు. ఉచిత విద్యుత్ హామీలో వైసీపీ పూర్తిగా విఫలమైందన్నారు. రకరకాల చార్జీల పేరుతో ఐదేళ్లలో 9సార్లు కరెంట్ చార్జీలను పెంచుతూ ప్రజలకు షాక్‌లు ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికలలో అధికార పార్టీ నేతలకు ప్రజలు ఓటు తో తగిన షాక్‌ను కొట్టాలని గొట్టిపాటి పిలుపునిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున హారతులు ఇచ్చి, వీరతిలకం దిద్ది స్వాగతం పలికారు. కార్యక్రమంలో కరి పరమేష్, మానం మురళీ మోహన్‌దాస్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నారయ్య, నర్రా వీరయ్య, భీమని శ్రీనివాసరావు, సర్పంచ్ ఒంపుగుడి అంజనా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మహిళా పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

కొప్పరంలో అగ్నిప్రమాదం

4ఎకరాల అరటి తోట దగ్ధం


ఆహుతైన అరటి తోట

కొప్పరం (సంతమాగులూరు), ఏప్రిల్ 13 : మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సయ్యద్ సుబానీకి చెందిన 4 ఎకరాల అరటితోట అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో అరటి తోట పూర్తిగా ఆహుతయింది. శనివారం మధ్యాహ్నం సమయంలో అరటి తోట నుంచి ఎగిసిపడుతున్న మంటలను చూసిన రైతులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అద్దంకి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని రైతు సయ్యద్ సుబానీ వాపోయారు.

ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల విజయదుందుబి

సంతమాగులూరు, ఏప్రిల్ 13 : సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో విజయదుందుబి మోగించారు. గతంలో లేని విధంగా ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రైవేటు కళాశాలకు దీటుగా ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఇంటర్‌లో హేమంత్ 945/1000, సీహెచ్ గౌతమి 944, మౌనిక 875 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సర ఫలితాల్లో హారిక 429/470, కోమలి 424/ 470 మార్కులతో పాలసయ్యారు.

17న శ్రీరామ నవమి ఉత్సవాలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 13: మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో ఈ నెల 17వ తేదీన రామాలయం వద్ద మా ఊరు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు చందు డాన్స్ అ కాడమీ ఒంగోలు వారి భరతనాట్య ప్రదర్శన, అనంతరం వివిధ రంగాలల్లో సేవలందించిన పలువురు సేవామూర్తులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

చీరాలటౌన్, ఏప్రిల్ 13 : అసాంఘిక శక్తులపై చీరాల పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో శనివారం టూటౌన్ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మురళి విస్తృత తనిఖీలు చేశారు. స్టేషన్ పరిధిలోని ఎల్‌బీఎస్‌నగర్, ఆనందపేట, గాంధీనగర్ ప్రాంతాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో రూట్ మార్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతంలోని ప్రయాణిస్తున్న పలు వాహనాలు తనిఖీ చేసి డ్రైవర్‌లకు సూచనలు చేశారు. అంతేకాకుండా స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్‌లకు వారి నివాసాల వద్దనే కౌన్సెలింగ్ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి

మాజీ మంత్రి జేడీ శీలం


మాట్లాడుతున్న మాజీ మంత్రి జేడీ శీలం

పర్చూరు, ఏప్రిల్ 13 : నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. శనివారం రోటరీ భవనంలో పార్టీ నియోజకవర్గస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. జేడీ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి, జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, సీనియర్ నాయకులు తోట శివనాగేశ్వరరావు, పులిపాటి రవి, నల్లగొర్ల రామరాజు, పోతిన సంపత్ కుమార్, షేక్. అబ్దుల్ రహీమ్, జ్యోతి, భవనం పేరిరెడ్డి, పఠాన్ బాషా, అంబేద్కర్ పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, ఏప్రిల్ 13: బల్లికురవ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో హనుమారెడ్డి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ఉండటంతో సమావేశాన్ని సాధారణంగా నిర్వహిస్తామని, సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు రావాలి

కూటమి అభ్యర్థి కొండయ్య


ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 13 : రాష్ట్రంలో అందరి భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావల్సిన చారిత్రాత్మక అవసరాన్ని గుర్తించి కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. ఎంజీసీ మార్కెట్‌లో శనివారం బీటీఎఫ్ సభ్యులతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో ప్లకార్డులు పట్టుకుని బీటీఎఫ్ శ్రేణులు చేసిన నినాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సూపర్ సిక్స్ పథకాలతో అందే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి గెలుపు .. రాష్ట్ర అభివృద్ధికి మలుపు


ప్రచారాన్ని నిర్వహిస్తున్న గౌరీ అమర్‌నాథ్..రాజుపాలెంలో బాబీ ప్రచారం..గొట్టిపాటినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

చీరాల, ఏప్రిల్ 13 : కూటమి గెలుపు, రాష్ట్ర అభివృద్ధికి మలుపని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య కుమారుడు గౌరీ అమర్‌నాథ్ అన్నారు. శనివారం బీటీఎఫ్ (బెంగళూరు టీడీపీ ఫోరం) సభ్యులతో కలసి స్థానిక కామధేను కాంప్లెక్స్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కొండయ్యను ఎమ్మెల్యేగా, తెన్నేటి కృష్ణప్రసాద్ ఎంపీగా అఖండ మెజార్టీతో గెలిపించాలని అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. వైసీపీ అరాచక, అసమర్థ పాలనతో అన్నివర్గాల ఆర్థికంగా నష్టపోగా, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రతి దుకాణానికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. బీటీఎఫ్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీటీఎఫ్ ప్రతినిధులతో పాటు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ : రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) విజ్ఞప్తి చేశారు. శనివారం కేరాజుపాలెం గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్ కిషోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గడపగడపకు తిరిగి రవికుమార్ చేపట్టిన అభివృద్ధి పనులు, టీడీపీ చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాలలో ప్రధాన సమస్య తాగు నీటిని ఇంటింటికీ అందిస్తామన్నారు. వైసీపీ పాలన వలన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని, అన్ని వర్గాల ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఎంతో అనుభవశాలి అయిన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరు సమిష్టిగా ఎన్నికల లో పనిచేయాలని ఆయన కోరారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అద్దంకి అభ్యర్థి రవికుమార్‌ను బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను భారీ మెజారిటితో గెలిపించాలని బాబీ కోరారు. కార్యక్రమంలో గ్రామ నేతలు జాష్టి శ్రీరంగనాయకులు, అడుసుమల్లి శ్రీహర్ష, అమరనేని రమేష్‌బాబు, చెరుకూరి రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాటినగర్‌లో టీడీపీ ప్రచారం

మార్టూరు : పర్చూరు నియోజకవర్గం టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావును గెలిపించాలని కోరుతూ శనివారం గొట్టిపాటినగర్‌లో టీడీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అభివృద్ధిలో ఘోరంగా విఫలమైందన్నారు. బేల్దారి కూలీలకు కూడా పనిలేకుండా పోయిందన్నారు. ఇసుక కొరతతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోయారన్నారు. నాసిరకం మద్యం ప్రజల ప్రాణాలను బలిగొంటున్నదన్నారు. రాష్ట్ర అభివృద్ధి గాడిలో పడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ఇంటింటి ప్రచారం

ఇంకొల్లు : టీడీపీ కూటమి అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. శనివారం 1వవార్డులో నేతలు ఇంటింటికీ తిరిగి అభ్యర్థి ఏలూరిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డాక్టర్ బోడాల శ్యాంసుందర్, కొల్లూరి శివాజీ, వీరగంధం, ప్రసాద్, కరి శ్రీను, మీరావలి, బోడావుల శివయ్య, హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన లోపాల సవరణకు సర్వే

పేరాల(చీరాలటౌన్), ఏప్రిల్ 13 : విద్యార్థుల అభ్యసన లోపాలను సవరణ చేసుకునేందుకు సర్వే పరీక్షలు ఉపయోగపడతాయని ఎమ్ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన రాష్ట్ర స్థాయి సాధన సర్వే పరీక్షలు జరుగనున్నాయి. ఈక్రమంలో శనివారం పేరాల ఎఆర్ఎం ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి 13 మండలాలకు చెందిన సీఆర్పీలు, ఫీల్డ్ ఇన్విజిలేటర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పరీక్ష 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టులకు పరీక్ష ఉంటుందని, పరీక్ష రెండుసార్లు ఏదయినా రెండు సబ్జెక్టుల కాంబినేషన్‌తో ఉంటుందన్నారు. క్రమంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌గా పవని భానుచంద్రమూర్తి, పాఠశాల ప్రధానోపధ్యాయుడు సాల్మన్ రాజు, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

22న అనంతవరంలో దేవాలయ పునఃప్రతిష్ఠ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 13 : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈనెల 22వ తేదీన శ్రీ గంగా పార్వతీ సమేత భోగ మల్లేశ్వర స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నుంచి ప్రత్యేక పూజలు, 22న ఆలయ ప్రదక్షిణ, పూర్వ శిఖర కలశ ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 13: పర్చూరులోని ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, చిన్నయామిషన్. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా విద్యాదాత పాబోలు రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాబోలు ఉదయభాస్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. నిరుపేద రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 2 వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

అంబేడ్కర్ భావజాలం ఉన్నవారికే ఓటేయండి

చీరాలటౌన్, ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికల్లో అంబేడ్కర్ భావాజాలం కలిగిన నాయకులకు ఓటు వేయాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ముందస్తు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, ప్రేమ్‌కుమార్, అక్కల వెం కటేశ్వర్లు, అర్జునబాబు, సుభాని, మాధవరావు, కిరణ్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


యద్దనపూడి బ్రాంచి కెనాల్‌కు వచ్చిన జలాలు

కోనంకికి చేరిన సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 13 : కోనంకి సబ్ డివిజన్ పరిధిలో ఎన్ఎస్‌పీ కాలువలోకి శనివారం సాయంత్రానికి సాగర్ జలాలు ప్రవేశించాయి. చాలా తక్కువగా సాగర్ జలాలు ప్రవాహం వస్తున్నట్లు ఎన్నెస్పీ అధికారులు చెప్తున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు మార్టూరు మండలం బొల్లాపల్లి జీఎన్‌టీ రోడ్డు దాటి సాగర్ జలాలు దిగువకు ప్రవహించాయి. రాజుపాలెం మేజర్‌కు కూడా స్వల్పంగా జలాలు వెళుతున్నాయి. వారబంధీ పద్ధతిన పమిడిపాడు మేజర్, కోటపాడు మేజర్‌ను మూసివేశారు. మూడు రోజుల తర్వాత వాటిని తెరుస్తారు. యద్దనపూడి బ్రాంచి కెనాల్ ద్వారా జీఎన్‌టీ దాటిన తర్వాత నూతలపాడు మైనర్, ద్రోణాదుల మేజర్‌కు నీటి సరఫరాను పంపించనున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు. ప్రస్తుతం ఐఎన్‌టీ వద్ద 230 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. అక్కడ నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందంటున్నారు. శనివారం అర్ధరాత్రికి మార్టూరు, వలపర్ల మంచినీటి చెరువులకు నీరు చేరే అవకాశం ఉందని, మండలంలోని తాగునీటి చెరువులను నింపడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి తెలిపారు.

పర్చూరుకు చేరిన బ్యాలెట్ బాక్స్‌లు

పర్చూరు, ఏప్రిల్ 13 : బాపట్ల పార్లమెంట్‌కు సంబంధించిన ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లు పర్చూరు చేరినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఆర్వో గంధం శనివారం రవీందర్ తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లను జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు తెలిపారు. వాటి భద్రత బాధ్యత రిజర్వు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. వీవీ ప్యాట్స్ 430, బ్యాలెట్ యూనిట్స్ 359, సీయూ-359 చొప్పున స్ట్రాంగ్ రూంకు చేరాయన్నారు. పర్చూరు, యద్దనపూడి తహసీల్దార్‌లు సీహెచ్.సుబ్బయ్య, వై.నాగరాజు సారథ్యంలో బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూంకు చేర్చినట్లు ఆర్వో తెలిపారు.


ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ

కూలీలకు పనులు కల్పించాలి

పీడీ రాజేష్

బల్లికురవ, ఏప్రిల్ 13 : గ్రామాలలో రోజువారీ కూలీలు వలస పోకుండా ఉపాధీ హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డెరెక్టర్ ఎస్.రాజేష్ ఆదేశించారు. శనివారం మండలంలోని వేమవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. బోగస్ మస్టర్లు వేసినా, ఒకరికి బదులు మరొకరు పనులకు వచ్చినా సహించేది లేదని చెప్పారు. ప్రతి కూలికి రూ.300 వంతున కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు ఉన్నాయన్నారు. రైతులకు ఉపయెగ పడే పనులు చేయించాలన్నారు. పంట కాలువలు, చెరువులలో ఉన్న పూడిక తొలగించాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని పనులు చేసే సమయంలో తగుజాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజు, క్లస్టర్ టీఏ నాగబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన అంబడిపూడి చెరువు

- ఆరు గ్రామాలలో తాగునీటి ఎద్దడి
- మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్న ప్రజలు

బల్లికురవ, ఏప్రిల్ 13: మండలంలోని ఆరు గ్రామాలలో వారం రోజుల నుంచి తాగు నీటి ఎద్దడి నెలకొంది. అంబడిపూడి రక్షిత నీటి పథకం ద్వారా పెద అంబడిపూడి. చిన అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలకు తాగు నీరు అందాల్సి ఉంది. ఈ పథకం ద్వారానే గ్రామాలకు నీరు అందుతుంది. గత వారం రోజుల నుంచి స్టోరేజీ చెరువులో నీరు అడుగుకు చేరటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆరు గ్రామాలలో నీటి కష్టాలు మొదలయ్యాయి. సాగర్ నీరు చెరువుకు చేరేవరకు గ్రామాలకు నీటి సరఫరా జరిగే అవకాశాలు లేకపోవటంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరయితే గ్రామాలలోనే ఉన్న మినరల్ ఆర్వో ప్లాంట్ల నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. నిరుపేదలు నీటిని కొనుగోలు చేయలేక ఫ్లోరిన్ నీటినే సేవిస్తున్నారు. అధికారులు సకాలంలో పట్టించుకోక పోవడంతో నీటి ఎద్దడి తలెత్తిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సాగర్ నీటిని స్టోరేజీ చెరువులకు పూర్తిస్థాయిలో నింపి వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఆరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెండు గ్రానైట్ లారీల పట్టివేత

బల్లికురవ. ఏప్రిల్ 13 : పర్మిట్లు లేకుండా అక్రమంగా తరలి వెళుతున్న రెండు గ్రానైట్ ముడిరాయి లారీలను శుక్రవారం రాత్రి మైనింగ్ కార్యాలయ టీఏ భాస్కర్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. వేమవరం రోడ్డులో వెళ్తున్న ముడిరాయి లారీలను తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వెంటనే లారీలను బల్లికురవ పోలీసుస్టేషన్‌కు తరలించారు. తనిఖీలో భాగంగా పర్మిట్ ఉన్న ఒక లారీని కూడా మైనింగ్ అధికారులు నిలిపివేసినట్లు లారీ యజమానులు అధికారులపై మండిపడ్డారు. దీంతో గ్రానైట్ యజమానులు నిలదీయడంతో లారీలను విడిచిపెట్టారు.

ప్రశాంతంగా ఓటును వినియోగించుకోవాలి


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహారావు

బల్లికురవ. ఏప్రిల్ 13 : ఎన్నికలలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియెగించుకోవాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు కోరారు. శనివారం మండలంలోని వేమవరం, ముక్తేశ్వరం, రామాంజనేయపురం, వైదన, గొర్రెపాడు గ్రామాలలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలకు సహకరించాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జాగర్లమూడి వీఆర్‌వో మృతి

యద్దన పూడి, (మార్టూరు) ఏప్రిల్ 13 : యద్దనపూడి మండలం జాగర్లమూడి వీఆర్‌వో షేక్ కాలేషావలి (42) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఎన్నికల విధులు నిమిత్తం శుక్రవారం రాత్రి మండల రెవెన్యూ సిబ్బందితో కలిసి బాపట్ల వెళ్లారు. అక్కడ కాలేషావలి రాత్రి 11 గంటలకు అస్వస్థతకు గురవడంతో రెవెన్యూ అధికారులు చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మధ్యలోనే ఆయన మృతి చెందినట్లు చీరాలలోని వైద్యులు తెలిపారు. అనంతరం ఆయన మృతదేహాన్ని స్వగ్రామం యద్దనపూడికి తీసుకొచ్చారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అత ని మృతదేహానికి తహసీల్దార్ వై.నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున మట్టి ఖర్చులకు నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ25 వేలు అందజేశారు.